క్లుప్తంగా

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న క్షమాదేశ్ పాండే

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే అన్నారు. పట్టణంలోని కేంద్రీయ విద్యాలయం, బంగారుగూడలోని మైనార్టీ వెల్ఫేర్ పాఠశాలల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వరకట్న, బాల్య వివాహాలు, వాహన నిబంధనలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

ఉట్నూర్‌రూరల్: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఫకీర్‌గుట్టకాలనీలో గల నాక్ సెంటర్‌లో కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసిన మొదటి బ్యాచ్ 29 మంది, రెండవ బ్యాచ్ 17 మంది మహిళలకు మంగళవారం సర్టిఫికెట్లు, ఉచితంగా కుట్టు మిషన్లు అందజేశారు. ఎంపీపీ జైవంత్‌రావు, వైస్ ఎంపీపీ బాలాజీ, ఇంద్రవెల్లి ఏఎంసీ చైర్మన్ జాదవ్ శ్రీరామ్, నాక్ ఏడీ నాగేంద్ర, అసిస్టెంట్ లేబర్ అధికారి గోవర్ధన్, నాక్ ఇన్‌స్ట్రక్టర్ నిక్కత్ ఫరహీన్, ఖదీరా, నిర్వాహకుడు అంజత్ ఖాన్, నాయకులు ఉన్నారు.

రైతు కిసాన్ యాత్రను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సాజిద్ ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో బుధవారం నిర్వహించే రైతు కిసాన్ యాత్రను విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రైతుల సమస్యలను తెలుసుకోవడానికి కిసాన్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, నాయకులు తరలిరావాలని కోరారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, గంగాధర్, శంతన్‌రావు, గోవర్ధన్ రెడ్డి, శేఖర్, నగేశ్ పాల్గొన్నారు.

'వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం'



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

జైనథ్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని పార్టీ నాయకుడు కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని నిరాల గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. 9ఏళ్లు ఎమ్మెల్యేగా, 5 ఏళ్లు మంత్రిగా పనిచేసిన జోగు రామన్న జిల్లాకు చేసిందేమి లేదన్నారు. ప్రస్తుతం జైనథ్–బేల జాతీయ రహదారిపై తర్నం బ్రిడ్జి కుంగిపోయి, రాకపోకలు నిలిచిపోయి ప్రజలు అవస్థలు పడుతున్నారని, ఇది ఎమ్మెల్యే వైఫల్యమేనని దుయ్యబట్టారు. నాయకులు సంతోష్, అశోక్ రెడ్డి, రాందాస్, బాపూరావ్, సుదర్శన్, మనోజ్, రాజన్న, దిలీప్, శంకర్, వామన్ పాల్గొన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రాం అన్నారు. మంగళవారం ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో నెక్ట్స్ జనరేషన్ ఎంప్లాయిమెంట్ స్కిల్స్ అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మైక్రోసాఫ్ట్ అజూర్ అనే సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశాలపై శిక్షణ ప్రారంభించారు. టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ దయాకర్, నరేందర్, సాయిప్రసాద్, సంతోష్ కుమార్, నర్సింగ్‌రావు, జ్యోత్స్న, అనిత పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- గ్రామాలకు త్వరలో నీటి పరీక్ష కిట్ల పంపిణీ
- సురక్షితమా..కాదా..అనేది నిర్ధారణ
- ప్రజలు ఉపయోగించుకోవాలని సూచన

నేరడిగొండ: మనిషికి అధిక శాతం వ్యాధులు తాగు నీటి వల్లనే వస్తాయన్నది వైద్యుల మాట. అందుకే పరిశుభ్రమైన నీటిని తాగాలని తరచూ సూచిస్తుంటారు. ప్రజారోగ్యంపై ప్రభుత్వం దృష్టిసారించింది. రక్షిత నీరందించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, గ్రామ పంచాయతీ కార్యదరులు నడుంబిగించారు. నీటిలో ఖనిజ లవణాలు, మూలకాలు సరిగ్గా ఉన్నాయా..లేదా..? అని నీటిని పరీక్షించేందుకు అధికారులు గ్రామ పంచాయతీలకు కిట్లు అందజేశారు.

మండలానికి త్వరలో 32 కిట్లు..

మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కిట్లు అందజేయనున్నారు. వాటి ద్వారా బోరుబావులు, రక్షిత నీటి పథకాల్లో నీటి నాణ్యతను పరీక్షించి ఆ నీరు ప్రజలు తాగవచ్చా.. లేదా అనే విషయాన్ని కార్యదర్శులు, అధికారులు నిర్ణయించనున్నారు. గ్రామాల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తిరుగుతూ నీటి శాంపిళ్లు సేకరిస్తూ తాగవచ్చా..లేదా అనే విషయాలను వివరిస్తున్నారు.



మిషన్ భగీరథ నీటిని సేకరిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు (ఫైల్)

నీటిని పరీక్షించడం ఇలా..

గ్రామంలో పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, వాటర్ మెన్‌లు కలిసి బోరుబావులు, రక్షిత పథకాల పైపుల ద్వారా రసాయనాలు పంపించి నీటి నాణ్యత ఏ మేరకు ఉన్నది తెలుసుకుంటారు. దానిని బట్టి ఆ నీటిని ఉపయోగించా వచ్చా.. లేదా అన్నది నిర్ధారణ చేస్తారు. రసాయనిక పరీక్షలు నెలకోసారి, బ్యాక్టీరియా పరీక్షలు వారానికోసారి చేస్తారు. వర్షాకాలానికి ముందు, తర్వాత, ఎండాకాలంలో నీరు ఎలా ఉన్నాయో తెలుసుకోవడం వీరి బాధ్యత. ఫ్లోరైడ్, క్లోరైడ్, నైట్రేట్, సల్ఫేట్, ఐరన్ తదితర 9 అంశాలు తప్పనిసరిగా పరీక్ష చేయనున్నారు. కెమికల్, ఫ్లోరైడ్, ఐరన్, క్లోరైడ్ రిసిడ్యుయల్ క్లోరిన్, అల్కానిటీ టర్బోడియావంటి మలినాలను పరీక్షల ద్వారా గుర్తించి నెలవారీ మంచినీటి వనరులను పరీక్షించనున్నారు. ఆ నివేదిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయానికి పంపిస్తారు. వారు విశ్లేషించి క్లోరిన్, నైట్రేట్, ఐరన్ బిల్లలతో పాటు బ్లీచింగ్ ఏమేరకు ఎన్ని రోజులకు కలపాలో నిర్ధారిస్తారు. పూర్తిగా పరీక్షించిన తర్వాత నీటిని సరఫరా చేస్తారు.

నీటి నాణ్యత తెలుసుకోవాలి

ఫ్లోరైడ్ నీటిని తాగడం, వంట చేయడం, ఇతర పనులకు వాడకూడదు. నీటి కిట్ల ద్వారా బ్యాక్టీరియాను టెస్టు చేస్తాం. గ్రామాల్లో ఉండే వాటర్ ప్లాంట్లలో టెస్టులు చేసుకోవచ్చు. ఈ నీటి కిట్లపై ప్రజలు అందరు అవగాహన కలిగి వినియోగించుకోవాలి. సిబ్బంది నీటి పరీక్షలు చేసి అవగాహన కల్పిస్తారు.

– షేక్ ఫిరోజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ, నేరడిగొండ

బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధి



విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్‌ఎస్ హయాంలో గ్రామాలు అభివృద్ధి చెందాయని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి, వాన్‌వాట్, ఖండాల, పిప్పల్‌ధరి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. వాన్‌వాట్, పిప్పల్‌ధరి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సవారి బంగ్లా షెడ్లను ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో రూ.6 కోట్ల వ్యయంతో సవారి బంగ్లాతోపాటు షెడ్ల నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. రైతుల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పాటుపడుతుంటే, అది చూసి ఓర్వలేకనే వారిని అవమానపర్చేలా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ మనోహర్, ఎంపీపీ గండ్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ జంగు, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు రోకండ్ల రమేశ్, ఆత్మ చైర్మన్ జిట్టా రమేశ్, ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ రమేశ్ పాల్గొన్నారు.

కులవృత్తులకు అండగా..

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల కులవృత్తులకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. పట్టణంలోని కైలాసనగర్‌లో విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మల సంఘ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ కులవృత్తుల నైపుణ్యంపై శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. సంఘం నాయకులు నర్సిములు, స్వామి, కిష్టాయ్య, బీఆర్‌ఎస్ నాయకులు రాంకుమార్, గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నాబావుసాఠె వర్ధంతి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్



గుడిహత్నూర్: నివాళులర్పిస్తున్న నాయకులు

ఉట్నూర్‌రూరల్: బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనకు నిరంతరం పోరాడిన మహనీయుడు అన్నాబావు సాఠెను యువత ఆదర్శంగా తీసుకోవాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొజ్జు, నాయకులు ఈ వర్ధంతిలో పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: అన్నాబావు సాఠె ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ జోగుప్రేమేందర్ పేర్కొన్నారు. పట్టణంలోని అన్నాబావు సాఠె చౌక్‌లో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అన్నాబావు సాఠె అసోసియేషన్ అధ్యక్షుడు ఉద్ధవ్ కాంబ్లే, ఉపాధ్యక్షుడు సూర్యకాంత్, దుర్గం ట్రస్ట్ చైర్మన్ దుర్గం శేఖర్, యూనుస్ అక్బానీ, బండారి దేవన్న పాల్గొన్నారు.

గుడిహత్నూర్: స్థానిక అన్నాబావు సాఠె విగ్రహానికి పూలమాలలు వేశారు. జెడ్పీటీసీ పతంగే బ్రహ్మానంద్, సర్పంచ్ జాదవ్ సునీతారమేష్, సాఠే మెమోరియల్ అసోసియేషన్ అధ్యక్షుడు సముఖ్‌రావ్ సత్యనారాయణ ఉన్నారు.

ఇంద్రవెల్లి: అన్నాబావు సాఠె వర్ధంతిని నిర్వహించారు. స్థానిక బీఎస్పీ కార్యాలయం, మండలకేంద్రంలోని అన్నాబావు సాఠె ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో, వ్యవసాయ మార్కెట్ కార్యాలయ సమీపంలో జరిగిన వర్ధంతిలో నాయకులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండల కేంద్రంలో ఆయన విగ్రహానికి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ మల్లేశ్ పూలమాల వేశారు. జిల్లా కోకన్వీనర్ సుభాష్, మహాజన్ సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుభాష్, అన్నాబావుసాఠె అసోసియేషన్ జిల్లా నాయకుడు గైక్వాడ్ గణేశ్ పాల్గొన్నారు.

ప్రత్యేక క్లినిక్‌లు మహిళలకు వరం

- జిల్లా నోడల్ అధికారి జాన్‌బాబు

ఆదిలాబాద్‌టౌన్: మహిళల కోసం ప్రతీ మంగళవారం నిర్వహిస్తున్న ప్రత్యేక క్లినిక్‌లు వరం లాంటివని జిల్లా నోడల్ అధికారి జాన్‌బాబు అన్నారు. జిల్లాకేంద్రంలోని హమాలీవాడ పీహెచ్‌సీలో మంగళవారం ఏర్పాటు చేసిన ఆరోగ్య మహిళా క్లినిక్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన మహిళలు, వైద్య సిబ్బంది ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంత మహిళల కోసం జిల్లాలో రెండు ఆరోగ్య మహిళా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మహిళల కోసం ప్రతీ మంగళవారం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 8 రకాల వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌ఓ నరేందర్ రాథోడ్, కుష్టు నివారణ అధికారి శ్రీకాంత్, మలేరియా నివారణ అధికారి శ్రీధర్, వైద్యులు శ్రావ్యవాణి, దీపిక, వామన్ రావు, వినోద, రణీత ఉన్నారు.



బజార్‌హత్నూర్: మాట్లాడుతున్న జాన్‌బాబు

బజార్‌హత్నూర్: ఆరోగ్య మహిళా క్లినిక్‌లను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నోడల్ అధికారి జాన్‌బాబు కోరారు. మండలకేంద్రంలోని పీహెచ్‌సీలో రికార్డులను మంగళవారం పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్లు భీంరావ్, శిల్పా, అలేఖ్య, హెచ్‌ఈవో సూర్యప్రకాశ్, సూపర్‌వైజర్ దేవిదాస్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



నేరడిగొండ: కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నేరడిగొండ/ఇచ్చోడ/ఉట్నూర్‌రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని జిల్లాలో పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. మంగళవారం నాటికి సమ్మె 13వ రోజూ చేరింది. బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌కు ఇచ్చోడలో కార్మిక సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. నేరడిగొండలో కార్మికుల సమ్మెకు ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఆరెల్లి మల్లేశ్ మద్దతు తెలిపారు. కార్మికులు చేస్తున్న సమ్మె విషయంపై సీఎల్పీ నాయకుడు భట్టి విక్రమార్కను హైదరాబాద్‌లో ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ కలిశారు. సమస్య పరిష్కారం కోసం అసెంబ్లీలో మాట్లాడాలని కోరినట్లు తెలిపారు.

పాఠశాల సందర్శన

తాంసి: మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలను మాజీ ఎంపీ గోడం నగేష్ మంగళవారం సందర్శించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. గతంలో ఆయన ఉపాధ్యాయుడు కావడంతో టీచర్‌గా మారి వారితో సంభాషించారు. పాఠశాలల్లో సదుపాయాల గురించి హెచ్‌ఎం రమణను అడిగి తెలుసుకున్నారు. జెడ్పీటీసీ రాజు, సర్పంచ్ అశోక్, వైస్ ఎంపీపీ రఘు, నాయకులు ఆశన్న, దేవేందర్, విలాస్ ఉన్నారు.

సంక్షేమ పథకాలతో ప్రతీ కుటుంబానికి లబ్ధి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్

కైలాస్‌నగర్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ప్రతీ కుటుంబం ఏదో రకంగా లబ్ధి పొందుతుందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పట్టణంలోని 17 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలలో ఇప్పటి వరకు రూ.10లక్షల విలువైన చెక్కులు అందించామన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మణ్, రాంకుమార్, సాజిదొద్దీన్, చందు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలి

కైలాస్‌నగర్: వర్షాలు కురుస్తున్నందున పట్టణంలో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో పారిశుధ్య జవాన్లతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, వీబీడీ కన్సల్టెంట్స్ శబానాజ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న జోగు ప్రేమేందర్

నాణ్యమైన భోజనం అందించాలి

ఉట్నూర్‌రూరల్: వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం, వసతి సౌకర్యాలు కల్పించాలని యూత్ కాంగ్రెస్ మండల నాయకులు కోరారు. మంగళవారం స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలను వారు సందర్శించారు. ఇటీవల విద్యార్థులు అస్వస్థతకు గురికాగా, నాయకులు వారికి అందిస్తున్న భోజనం, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వసతి గృహంలో కిటికీలకు అట్టముక్కలు అడ్డుగా పెట్టి చదువులు కొనసాగిస్తున్నారని అన్నారు. వసతి గృహం చుట్టూ మురుగునీరు, పిచ్చి మొక్కలు ఉన్నాయన్నారు. ప్రహరీ సౌకర్యం లేదన్నారు. మండల అధ్యక్షుడు కలీమొద్దీన్, ఉపాధ్యక్షులు అఖిల్, జావిద్‌ఖాన్, మసూద్, సోహెల్, శ్రీకాంత్, గుగ్గిల్ల బెన్హర్, రఘు, రాకి, రాజేశ్, గణేశ్ తదితరులు ఉన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న నాయకులు

ఉధృతంగా బోథ్ డివిజన్ ఉద్యమం

బోథ్: బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని చేస్తున్న ఉద్యమం ఉధృతమవుతోంది. డివిజన్‌గా ఏర్పాటు చేయాలని చేస్తున్న దీక్షలు మంగళవారం రెండోరోజూ చేరుకున్నాయి. లయన్స్ యూత్ సభ్యులు దీక్ష చేపట్టారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, గ్రామాల ప్రజలు బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడ్డారు. బోథ్‌ను డివిజన్‌గా ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. వర్షంలోనూ నిలబడి నినదించారు. కాగా ప్రభుత్వం స్పందించి డివిజన్ ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. బోథ్ రెవెన్యూ డివిజన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. రెవెన్యూ డివిజన్ సాధించే వరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని పేర్కొంటున్నారు.



దీక్షలో కూర్చున్న లయన్స్ యూత్ సభ్యులు

వర్ధంతి సభకు రావాలని ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: తుడుందెబ్బ వ్యవస్థాపకుడు సిడాం శంభు ఐదో వర్ధంతి సభకు రావాలని ఆదివాసీ గిరిజన సంఘాల నాయకులు ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయక్‌ను కోరారు. ఈ మేరకు పీవోను మంగళవారం ఆహ్వాన పత్రం అందించారు. ఉట్నూర్ కేబీ ప్రాంగణంలో ఈ నెల 20న ఉదయం 11గంటలకు సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో ఆదివాసీ సంఘాల నాయకులు పుర్క బాపూరావు, సోనేరావు, కుమ్ర వినాయక్ తదితరులున్నారు.

సంక్షిప్త వార్తలు

కార్మిక గర్జన విజయవంతం చేయాలి

ఎదులాపురం: కార్మిక సమస్యల పరిష్కారానికి హైదరాబాద్‌లో ఆగస్టు 4న నిర్వహించే కార్మిక గర్జనను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్‌సింగ్ కోరారు. జిల్లా కేంద్రంలో మంగళవారం గర్జన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నితిన్, జమీర్, నవనాథ్, బండు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

పౌష్టికాహారం కిట్లు అందజేత

తలమడుగు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్యుడు హరీశ్ మంగళవారం పౌష్టికాహారం కిట్లు అందజేశారు. వైద్య సిబ్బంది, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి

బోథ్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం ప్రభుత్వం రైతు రుణమాఫీ అమలు చేయాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన రైతులతో కలిసి మాట్లాడారు. కనీసం యాభై శాతం రుణాలను మాఫీ చేయలేదన్నారు. రైతులు రాజు, సోము, గంగారాం, శంభు తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గం

సిరికొండ: మండలంలో నూతన ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అశీల దత్తు, ఉపాధ్యక్షుడిగా ప్రవీణ్, కోశాధికారిగా లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శిగా రసూల్ ఎన్నికయ్యారు.

రైతులకు క్షమాపణ చెప్పాలి

సిరికొండ: రైతులకు 24 గంటల విద్యుత్ అవసరం లేదని రైతులను కించపర్చిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వెంటనే వారికి క్షమాపణ చెప్పాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. లక్ష్మీపూర్ రైతు వేదికలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఫకీర్‌నాయక్ తాండలో త్రీఫేజ్ విద్యుత్‌ను ప్రారంభించారు.

వైద్యపరీక్షలు

సిరికొండ: మండలంలోని రాయిగూడలోని ఆశ్రమ పాఠశాలలో మంగళవారం విద్యార్థులు, గ్రామస్తులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వారికి నర్సాపూర్ వైద్యురాలు హిమబిందు వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థికసాయం

ఆదిలాబాద్‌టౌన్: క్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని అదిత్యనగర్ కాలానికి చెందిన నిరుపేద విద్యార్థి శ్యాంసుందర్‌కు ఆదిత్య ఖండేష్కర్ సొసైటీ అధ్యక్షుడు ఆదిత్య ఆర్థికసాయం అందించారు. మంగళవారం వారి ఇంటికెళ్లి రూ.6500 నగదును కుటుంబీకులకు అందజేశారు.

ఘనంగా బోనాల పండుగ

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో బోనాల పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. హెచ్‌ఎం సాబీర్ హుస్సేన్, డైరెక్టర్లు శైలేందర్, విజయబాబు, రాకేశ్ పాల్గొన్నారు.

సన్మానం

ఇంద్రవెల్లి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉత్తమ అవార్డు అందుకున్న హర్కపూర్ అంద్‌గూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గేడం శ్రీరామ్‌కు మంగళవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాథోడ్ అనిల్‌కుమార్, టీయూటీఎఫ్ మండల అధ్యక్షుడు మెస్రం రవీందర్ ఉన్నారు.

'రాహుల్‌గాంధీని విమర్శించేస్థాయి కేటీఆర్‌కు లేదు'

ఉట్నూర్‌రూరల్: ఏఐసీసీ నేత రాహుల్‌గాంధీని విమర్శించేస్థాయి మంత్రి కేటీఆర్‌కు లేదని పార్టీ నియోజకవర్గ నాయకుడు, న్యాయవాది పెందూర్ ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ రాహుల్‌గాంధీపై జగిత్యాలలో ఇటీవల మంత్రి కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండించారు. వ్యవసాయం గురించి తెలియదని అనడం సరికాదన్నారు. సమావేశంలో ఎక్బాల్, మల్లారెడ్డి, సునీల్, కలీం పాషా, కలీం పాల్గొన్నారు.

రేపు సిడాం శంభు వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: ఉట్నూర్‌లోని మత్తడిగూడలో గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) వ్యవస్థాపక నాయకుడు సిడాం శంభు 5వ వర్ధంతి నిర్వహించనున్నట్లు మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సిడాం శంభు వర్ధంతికి జిల్లాలోని ఆదివాసీ సంఘాల, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తరలిరావాలని కోరారు.

బుద్ధుడి బోధనలు అనుసరణీయం

ఇంద్రవెల్లి: గౌతమ బుద్ధుడి బోధనలు అనుసరణీయమని భారతీయ బౌద్ధ మహాసభ భైంసా పట్టణ అధ్యక్షుడు హేమ్లే ప్రసంజీత్ అన్నారు. మండలంలోని సట్వాజిగూడ గ్రామంలోని దమ్మచక్ర బుద్ధ విహార్‌లో 16వ రోజులుగా కొనసాగుతున్న వర్షవాస్ కార్యక్రమానికి మంగళవారం ఆయన హాజరయ్యారు. ముందుగా మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి, రచయిత మధు బావల్కర్, గౌతం, సంతోష్, కిరణ్, శాంతాబాయి తదితరులు ఉన్నారు.

30న అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఎన్నికలు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 30న అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించనున్నట్లు అడహక్ కమిటీ గౌరవ అధ్యక్షుడు శేఖర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రగునాథ్ పవర్, అనిల్ సావాడే తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా కమిటీ కాలపరిమితి ముగిసినందున ఎన్నిక నిర్వహణకు అడహక్ కమిటీని నియమించామన్నారు. 22, 23 తేదీల్లో నామినేషన్ ప్రక్రియ, 24న పరిశీలన, అదేరోజు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉప సంహరణ ఉంటుందన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు అభ్యర్థులకు చిహ్నాల కేటాయిస్తారన్నారు. 30న ఎన్నికలు అనంతరం సాయంత్రం 4 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు.

'ఫసల్ బీమా' అమలు చేయాలి

తలమడుగు: రాష్ట్రంలో ఫసల్ బీమా పథకం అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తూ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. కిసాన్‌మిత్ర కోఆర్డినేటర్ రమాకాంత్ యాదవ్, పద్మాకర్‌రెడ్డి, నేతుల గంగన్న, ఆనంద్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

హామీలు విస్మరించిన ప్రభుత్వం

తాంసి: ఎన్నికల హామీలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం విస్మరించిందని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోష్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండటంతో మళ్లీ ప్రజలకు చేరువయ్యేందుకు పథకాలను ప్రవేశపెడతామని అబద్ధపు హామీలు ఇస్తోందన్నారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు నర్సారెడ్డి, పోచ్చారెడ్డి, విలాస్, అశోక్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'



ప్రజలలో మాట్లాడుతున్న రూపేశ్‌రెడ్డి

బేల: ఏజెన్సీ ప్రాంత గ్రామాల్లో సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి ఆరోపించారు. మండలంలోని ఖడ్కీలో మంగళవారం ఆయన పర్యటించి, ఆదివాసీ సమస్యలను తెలుసుకున్నారు. రూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రేషన్‌షాపు, బస్సు సౌకర్యం లేక వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రేషన్, ఇతరత్రా పనులకు 4 కి.మీ దూరాన ఉన్న గణేష్‌పూర్ పంచాయతీకి వెళ్తున్నారని అన్నారు. ఖడ్కీ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఉపసర్పంచ్ దైరవాన్, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు గోడే అవినాష్ పాల్గొన్నారు.